


కౌంటింగ్ సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ

ఆచంట ఆర్ఒ స్వామినాయుడు

ప్రజాశక్తి - ఆచంట

భీమవరంలోని సీతా పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల నాలుగో తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపు విధులు నిర్వహించే సిబ్బందికి, ఏజెంట్లకు గుర్తింపు కార్డులు జారీ చేశామని ఆచంట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు తెలిపారు. శనివారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్ల కోసం వాహనాల పార్కింగ్ స్థలంలో జిల్లా ఎన్నికల అధికారి బస్సులను ఏర్పాటు చేశారన్నారు. ఆ బస్సుల్లో విష్ణు కళాశాల గేటు వరకు తీసుకెళ్తారన్నారు. కౌంటింగ్ సందర్భంలో గోప్యత, జవాబుదారీతనం తప్పనిసరని అన్నారు. ఒక్కో టేబుల్ వద్ద ఆయా అభ్యర్థుల తరపున ఒక్కో ఏజెంట్‌ను అనుమతిస్తామన్నారు.

ఖరీఫ్‌కు వేళాయే..!


విజ్జేశ్వరం వద్ద కాల్వలకు నీరు విడుదల చేస్తున్న ఇరిగేషన్ అధికారులు

- పంట కాలువలకు సాగునీరు విడుదల
- తొలిరోజు 500 క్యూసెక్కుల నీరు దిగువకు
- ఆధునికీకరణ లేమితో సాగునీరు పారేందుకు ఆటంకాలు
- రెండో వారంలోనైనా నారుమడులు పడేనా?
- రెండు జిల్లాల్లో మూడున్నర లక్షల ఎకరాల్లో వరిసాగు
- కౌలురైతులకు రుణాలిచ్చి ఆదుకునేనా?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ సాగుకు సమయం ఆసన్నమైంది. గోదావరి నుంచి పంట కాలువలకు ఇరిగేషన్ అధికారులు శనివారం సాగునీటిని విడుదల చేశారు. ముందుగా ప్రకటించిన ప్రకారమే జూన్ ఒకటో తేదీన సాగునీటి విడుదల జరిగింది. తొలిరోజు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు నిడదవోలు ఇఇ ఎం.దక్షిణ మూర్తి తెలిపారు. వారంరోజుల్లో కాలువల శివారు ప్రాంతాలకు నీరు చేరనుంది. మరోపక్క నైరుతి పవనాలు కేరళను తాకడంతోపాటు ఆ ప్రభావం రాష్ట్రంలోనూ కన్పిస్తోంది. శనివారం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. చల్లనిగాలులు వీయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో ఖరీఫ్‌లో మూడున్నర లక్షలకుపైగా ఎకరాల్లో రైతులు వరిసాగు చేసేందుకు సమాయత్తమయ్యారు. అందుకు సంబంధించిన విత్తనాలు సైతం రైతులు సిద్ధం చేసుకున్నారు. ఖరీఫ్‌కు సంబంధించి రాయితీ విత్తనాలు, ఎరువులు సైతం అన్నీ సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయాధికారులు ఇప్పటికే ప్రకటించారు. దీంతో ఇక ఖరీఫ్ సాగు చేపట్టడమే మిగిలింది. ముందస్తు సాగులో భాగంగా జూన్ ఒకటిన ప్రభుత్వం సాగునీటి విడుదలకు శ్రీకారం చుట్టింది. ప్రణాళిక ప్రకారమే నీటి విడుదల జరిగినా ముందస్తు సాగు సాగేనా అనే మీమాంస నెలకొంది. పంట కాలువలకు పూర్తిస్థాయిలో నీరు చేరేసరికి వారం రోజుల వరకూ పట్టే అవకాశం ఉంది. దీంతో జూన్ రెండో వారంలోనైనా రైతులు నారుమడులు వేస్తారా అనే చర్చ నడుస్తోంది. ప్రతియేటా జూన్ నెలాఖరు వరకూ నారుమడులు ప్రారంభించని పరిస్థితి నెలకొంది. దీంతో ఖరీఫ్ సాగు ఆలస్యం కావడం, ఆ ప్రభావం రబీ సాగుపై పడటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో అపరాలు వంటి మూడోపంట పూర్తిగా కనుమరుగైంది. ఖరీఫ్ నారుమడులు సకాలంలో పడితేనే రబీ పంట సైతం సకాలంలో ఇంటికి చేరుతుంది. ముందస్తు సాగుపై రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు సఫలమవుతారా.. లేక వదిలేస్తారా వేచిచూడాలి. ఖరీఫ్ నారుమడులు సకాలంలోనే వేస్తేనే రైతులకు సైతం మేలు జరిగే అవకాశం ఉంది.

ఆధునికీకరణ లేమితో తీవ్ర ఆటంకాలు

పంటకాలువలు ఎక్కడికక్కడ మెరకతేరిపోయాయి. డెల్టా ఆధునికీకరణ పనులను ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టేసింది. దీంతో కాలువల నిండా గుర్రపుడెక్క, తూడు పేరుకుపోయింది. దీంతో సాగునీరు కిందకు వేగంగా పారని పరిస్థితి నెలకొంది. శివారు పొలాలకు సాగు నీరు పూర్తిస్థాయిలో చేరేసరికి చాలా రోజులు పట్టే పరిస్థితి కన్పిస్తోంది. గడిచిన ఐదేళ్లుగా డెల్టా ఆధునికీకరణ పనులకు సంబంధించి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. ప్రతియేటా రూ.300 నుంచి రూ.400 కోట్లకు సంబంధించిన పనులకు ప్రతిపాదనలు పంపడం, ప్రభుత్వం వాటిని ఆమోదించకపోవడం పరిపాటిగా మారింది. దీంతో ప్రతియేటా రైతులు తుఫాన్లు, వర్షాలకు తీవ్ర పంటనష్టం చవిచూస్తున్నారు. నారుమడుల దశలోనే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గోదావరి డెల్టా రైతుల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కౌలు రైతులకు రుణాలిచ్చేనా..?

రెండు జిల్లాల వ్యవసాయ సాగులో 70 శాతానికిపైగా కౌలురైతులే సాగు చేస్తున్నారు. దాదాపు మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. కౌలుకార్డుల వితరణలోగాని, బ్యాంకుల నుంచి పంటరుణాల మంజూరులోగాని కౌలురైతులకు తీరని అన్యాయం జరుగుతోంది. రెండు జిల్లాల్లోనూ పట్టుమని లక్షా 30 వేల మంది రైతులకు కూడా కౌలుకార్డులు ఇవ్వడం లేదు. ఇచ్చినవారిలో 20 శాతం మందికి కూడా పంట రుణాలు అందించని పరిస్థితి నెలకొంది. దీంతో కౌలురైతులు పంట పెట్టుబడుల కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రయివేటు వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లో చిక్కుకుని విలవిల్లాడిపోతున్నారు. ఈ ఏడాదైనా కౌలురైతులకు సకాలంలో పంటరుణాలిచ్చి ఆదుకోవాలని అంతా కోరుతున్నారు.


నరసాపురం : నేలకొరిగిన కొబ్బరి చెట్లు, విద్యుత్ స్తంభాలు

ఈదురుగాలులు.. చిరు జల్లులు

చల్లబడిన వాతావరణం - సేదదీరిన జనం

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో శనివారం ఉదయం ఆరు గంటల నుంచి ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వారం రోజులుగా రోహిణి కార్తె ఎండల తీవ్రతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఈ సమస్యల నుంచి శనివారం ఉదయం కురిసిన వర్షం ఉపశమనం కల్గించింది. గాలుల వల్ల ఉదయం నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. 10 గంటల తర్వాత పొడి వాతావరణం నెలకొంది.


ఆచంట : ఈదురుగాలులు, వర్షం

నరసాపురం: మండలం గొందిలో శనివారం ఉదయం వీచిన గాలులకు, కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభం, కొబ్బరి చెట్లు కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో సరఫరా నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. స్తంభం రోడ్డుపై కూలడంతో ఇరువైపులా తీగలు తెగిపడి ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ స్తంభాలు, కొబ్బరి చెట్లు తొలగించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. చెట్లు, స్తంభం కూలిన సమయంలో ఆ ప్రాంతంలో ప్రజలు ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

పాలకొల్లు: పట్టణంలో శనివారం ఉదయం వాతావరణం మారి చిరు జల్లులు పడ్డాయి. మూడు రోజులుగా రోహిణికార్తె ప్రభావంతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు వాతావరణం చల్లబడటంతో సేదతీరారు. ఉదయం 10 గంటలు తరువాత వాతావరణం తిరిగి ఎండ, మబ్బులతో దోబూచులాడింది.

పోలవరం: శనివారం ఉదయం వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు. ఉదయమే ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు పడ్డాయి. దీంతో వాతావరణం చల్లగా మారింది.

ఓట్ల లెక్కింపునకు పక్కాగా ఏర్పాట్లు

కలెక్టర్ సుమిత్‌కుమార్


కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. విష్ణు ఇంజినీరింగ్ కళాశాల, ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలల్లోని ఓట్ల లెక్కింపు కేంద్రాలను, మీడియా సెంటర్లను ఆయన శనివారం పరిశీలించారు. తొలుత విష్ణు ఇంజినీరింగ్ కళాశాలలో నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని, మీడియా సెంటర్‌ను పరిశీలించారు. మీడియా సెంటర్‌లో హైస్పీడ్ ఇంటర్‌నెట్, వైఫై కనెక్టివిటీ, టెలివిజన్లు ఏర్పాటు తదితర అంశాలపై తగు సూచనలు చేశారు. పోస్టల్ బ్యాలెట్ టేబుల్స్, సిట్టింగ్ ఏర్పాట్లను పరిశీలించి ఇబ్బంది లేని విధంగా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అనంతరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉండి నియోజకవర్గం కౌంటింగ్ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్యతో కలిసి పరిశీలించారు. టేబుల్స్ అమరిక, రౌండ్లవారీ వివరాల ప్రొఫార్మాలు, ఎన్‌కోర్‌లో డేటా నమోదు, అభ్యర్థులు, ఏజెంట్లు, సిబ్బంది కౌంటింగ్ హాలుకు చేరుకునే మార్గాలు తదితర విషయాలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ అధికారులు, అభ్యర్థులు, వారి ఏజెంట్లు లోపలికి వెళ్లే మార్గాలకు సూచిక బోర్డులు స్పష్టంగా ఉండేలా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కళాశాల ప్రవేశ ద్వారం నుంచి 100 మీటర్లలోపు వాహనాలకు అనుమతి లేనందున గుర్తింపు కార్డులు కలిగిన వ్యక్తులకు ఏర్పాటు చేసిన రవాణా సౌకర్యాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. వాహనాలకు పార్కింగ్ జోన్ సిద్ధం చేశామన్నారు. బారీకేడ్లు ఏర్పాటు వంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ డివైజ్‌లు లోపలికి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు అధికారులు, సిబ్బంది ఉదయం 5.30 గంటలకే ఎట్టి పరిస్థితుల్లో కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఆయన వెంట డిఆర్ఒ జె.ఉదయ భాస్కరరావు, ఎన్నికల అధికారులు చందన దుర్గాప్రసాద్, మద్రాపు సన్యాసిరావు తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గించొద్దు

శాంతి, సహనం, అహింస గుణాలు సమాజ ప్రగతికి మార్గదర్శకాలని, నేడు శాంతి సామరస్యాలు అత్యంత ఆవశ్యమని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. శనివారం స్వీప్ యాక్టివిటీస్‌లో భాగంగా కౌంటింగ్ రోజున శాంతిసామరస్యాలతో మెలగాలనే నినాదంతో ప్రచారభేరి కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు సహజమని, ఓటు వజ్రాయుధమని, కౌంటింగ్ రోజు ప్రతిఒక్కరూ సంయమనం పాటించాలని అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. యాక్టివిటీస్ జిల్లా బ్రాండ్ అంబాసిడర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ అధికారులకు, పోలీసులకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కంతేటి వెంకటరాజు, నందమూరి రాజేష్, బాబాజీసాహెబ్ పాల్గొన్నారు.

ఎవరి అంచనాలు వారివే..!

ఎగ్జిట్‌పోల్స్‌లో కొన్ని కూటమికి, మరికొన్ని వైసిపికి అనుకూలం

రెండు జిల్లాల్లో 10 స్థానాల వరకూ టిడిపి కూటమికే అంటూ అత్యధిక సర్వేలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల పర్వం ముగిసింది. దీంతో శనివారం సాయంత్రం 6.30 గంటల తర్వాత విడుదల చేసిన ఎన్నికల ఎగ్జిట్‌పోల్స్ సర్వత్రా ఉత్కంఠ రేపుతున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించి పలు సర్వేలు టిడిపి కూటమికి అనుకూలంగా, మరికొన్ని వైసిపికి అనుకూలంగా వెల్లడవ్వడం విశేషం. దీంతో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనే ఉత్కంఠ నెలకొంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా పదికిపైగా స్థానాలు టిడిపి కూటమి గెలుపొందే అవకాశం ఉన్నట్లు సర్వేలు తేల్చాయి.

సర్వేల అనంతరం బెట్టింగుల జోరు మరింత పెరిగింది. ఎగ్జిట్ పోల్స్‌లో వాస్తవమెంతో తేలాలంటే ఈ నెల నాలుగో తేదీ వరకూ వేచిచూడాలని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

సబ్ జైళ్లను సందర్శించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం స్పెషల్ సబ్ జైలును జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ సి.పురుషోత్తం కుమార్ శనివారం సందర్శించి ముద్దాయిలతో నేరుగా మాట్లాడి వారి కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. బెయిల్, ష్యూరిటీ వివరాలను సంబంధిత కోర్టు న్యాయమూర్తిని, ముద్దాయి తరపు న్యాయవాదిని వాకబు చేశారు. కేసు విచారణ వేగవంతం చేయాలని ఆదేశించారు. న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్థోమత లేని ముద్దాయిలకు మండల న్యాయ సేవా సంస్థ తరపున ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం జైలు పరిసరాలను, ముద్దాయి బ్యారక్‌లను, వంటశాలను, స్టోర్ రూమ్, ఆఫీస్ రూమ్‌లను పరిశీలించారు. ముద్దాయిలకు అందుతున్న భోజన వసతుల గురించి, డాక్టర్ విజిట్ గురించి జైలు సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, భీమవరం సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) బి.అప్పలస్వామి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) జి.సురేష్ బాబు, 1వ అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) పి.మనీషా, 2వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) డి.ధనరాజు, జైలు సూపరింటెండెంట్ డి.వెంకటగిరి, ఉచిత న్యాయవాదులు పిఎస్‌పిఎల్‌జి అంబేద్కర్, బి.లోకేశ్వర రావు, బి.సురేష్ కుమార్, కె.జ్యోతి, పిఎల్‌వి మహాలక్ష్మి, కోర్టు సిబ్బంది, జైలు సిబ్బంది పాల్గొన్నారు.


భీమవరం టౌన్ : స్పెషల్ సబ్‌జైలును సందర్శించిన పురుషోత్తం కుమార్

నరసాపురం : ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం అమరావతి ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాల ప్రధాన జిల్లా న్యాయమూర్తి, ఛైర్మన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఏలూరు సి.పురుషోత్తం కుమార్ శనివారం నరసాపురం ఉప కారాగారాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి, నిందితుల కేసు వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, మంచినీటి సౌకర్యాలు, అనారోగ్యంగా ఉన్న వారికి అందించే వైద్య సదుపాయాలు ముద్దాయిలను అడిగి తెలుసుకున్నారు. జైలు ప్రాంగణంలో ఉన్న ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని అవసరమైన వారు ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) ఆర్.వరలక్ష్మి, ఒకటవ అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) కె.శ్రీనివాస్, ఉప కారాగారం పర్యవేక్షణాధికారి టి.అప్పారావు, జైల్ సిబ్బంది, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్.దానయ్య నాయుడు, కార్యదర్శి ఆర్‌జి.కుమార్, ప్యానల్ న్యాయవాదులు చిట్టి పద్మజ, శిరీష, శ్రీహరి, చాముండేశ్వరి, ఆనంద్ బాబు, పిఎల్‌వి వరలక్ష్మి పాల్గొన్నారు.

తణుకు: న్యాయసేవా సంస్థ ఉద్దేశాలు, ఆశయాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, ప్రజల సమస్యల పట్ల పూర్తి బాధ్యతతో పనిచేసినప్పుడే న్యాయ వ్యవస్థ పట్ల ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందని జిల్లా జడ్జి రత్నప్రసాద్ అన్నారు. శనివారం తణుకు సబ్ జైల్‌ను రాష్ట్ర న్యాయ సేవల సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితి బాగోలేక, న్యాయవాదిని పెట్టుకోలేని వారికి న్యాయ సేవల సంస్థ ద్వారా ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం ముద్దాయిల కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు సాయిరాం, రంజిత్‌కుమార్, నాగరాజు, చిరంజీవిరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూరంపూడి కామేష్, జైలు సూపరింటిండెంట్ మోహనరావు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు బళ్ల చినవీరభద్రరావు

ప్రజాశక్తి - తణుకు రూరల్

రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు అయ్యే ప్రభుత్వం వెంటనే భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు బళ్ల చినవీరభద్రరావు కోరారు. వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) సమావేశం వాటాల నాగేశ్వరరావు అధ్యక్షతన స్థానిక పార్వతీదేవి ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉన్న సంక్షేమ బోర్డు ద్వారా నిర్మాణ కార్మికులకు ఎవరికీ సంక్షేమ పథకాలు అమలు చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 12, 14 మెమో కారణంగా కార్మికులకు అందవలసిన సంక్షేమం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ప్రమాదం జరిగి చనిపోయినా, వృద్ధాప్యంతో చనిపోయినా బోర్డు ద్వారా రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ నష్టపరిహారం ఇచ్చి, వారి కుటుంబాలను ఆదుకునేవారని ఆయన తెలిపారు. ప్రసవించిన కార్మికురాలికి, కార్మికుని భార్య లేదా కుమార్తెకు రూ.20 వేలు బోర్డు ద్వారా కానుకగా అందించే సంక్షేమ పథకాలను అమలు చేయకుండా బోర్డులో ఉన్న సంక్షేమ నిధిని ఇతర పథకాల అమలుకు తరలించుకుపోయి నిర్మాణ కార్మికులకు మొండిచేయి చూపడం సరికాదని ఆయన విమర్శించారు. ఈ రాష్ట్రంలో మరికొద్ది రోజుల్లో నూతనంగా ఏర్పాటయ్యే ప్రభుత్వం తక్షణం స్పందించి భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధించాలని, గతంలో సంక్షేమ పథకాలకు దరఖాస్తు పెట్టుకున్న కార్మికులందరికీ సంక్షేమ పథకాలు వర్తింప చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తిరునాధం వెంకటేశ్వరరావు, వీరత్రిమూర్తులు, సోరపల్లి రామకృష్ణ, వీరవల్లి వెంకన్న, విప్పర్తి రవీంద్ర, విశ్వనాధం సుబ్బారావు, పిల్లి పరమేశ్వరరావు, తాళ్ల సత్యనారాయణ, గుడిమెట్ల రాధాకృష్ణ, నక్కా కరుణకుమార్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

ఐద్వా స్టడీ క్యాంప్ ప్రారంభోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి - నరసాపురం

మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో ఐద్వా రాష్ట్రస్థాయి స్టడీక్యాంప్ ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళా సమస్యలపై ఐద్వా పోరాటం ఎనలేనిదన్నారు. మహిళలు పోరాటాలతోపాటు ఆరోగ్యంపైనా దృష్టి సారించాలన్నారు. తొలుత ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి జెండావిష్కరణ చేసి తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ మహిళలు అధ్యయనంపై దృష్టి సారించడం లేదన్నారు. బృందాకరత్ జ్ఞాపకాలు 'రీటా నేర్పిన పాఠం'పై అధ్యయనం చేసి చర్చించుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్‌గా ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి వ్యవహరించారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ రీటా నేర్పిన పాఠం పుస్తకాన్ని పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కేతా పద్మజ, పొగాకు పూర్ణ, నేతలు బి.శ్యామల, ఎస్.ఉదయకుమారి, ఎస్.జయప్రభ, జయ ప్రశాంతి, వి.రాణి, బి.యశోద, షేక్ సరోజిని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

కానిచ్చేశారు..!

సాదాసీదాగా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

వ్యవసాయం, విద్య, తాగు, సాగునీటి అంశాలే ఎజెండా

కోడ్ నేపథ్యంలో సమావేశానికి ఉన్నతాధికారులు దూరం

వ్యవధి, ప్రణాళిక ప్రకారమే సమావేశం నిర్వహణ

ఈ ప్రభుత్వ హయాంలో ఇదే ఆఖరి సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఎన్నికల కోడ్ నేపథ్యంలో శనివారం జరిగిన ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. కలెక్టర్, జెసి వంటి జిల్లా ఉన్నతాధికారులెవ్వరూ హాజరుకాలేదు. మంత్రులు, ఎంపీలు, ఎంఎల్‌ఎలు సైతం ఏఒక్కరూ రాలేదు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరిగిన సమావేశానికి జిల్లా, మండల పరిషత్ సభ్యులు మాత్రమే హాజరయ్యారు. ఈ ప్రభుత్వ హయాంలో జరిగే ఆఖరి జిల్లా పరిషత్ సమావేశం ఇదే. తర్వాత జరిగే సమావేశం కొత్త ప్రభుత్వ పాలనలోనే జరగనుంది. గతంలో జిల్లా ప్రగతి, ఖర్చులకు సంబంధించి జిల్లా పరిషత్ అధికారులు పుస్తకాలు ముద్రించి సభ్యులకు, మీడియాకు అందించేవారు. పుస్తకాల అందజేతకు జెడ్‌పి అధికారులు పూర్తిగా తిలోదకాలు ఇచ్చేశారు. దీంతో ఏ రంగంలో ఎంత ఖర్చు పెట్టారు. ఈ కాలంలో ఏ పనులు చేశారో కూడా ఏ ఒక్కరికీ తెలియని పరిస్థితి నెలకొంది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎజెండాను కూడా పరిమితం చేశారు. వ్యవసాయం, విద్య, తాగు, సాగునీరు, విద్యుత్ అంశాలపైనే చర్చలు సాగాయి. పలువురు సభ్యులు స్కూళ్లలో జరిగే నాడు-నేడు పనులు, తాగునీటికి సంబంధించిన ఇబ్బందులను లేవనెత్తారు. వ్యవసాయ ప్రణాళికను అధికారులు సభకు వివరించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలిచ్చారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ నేపథ్యంలో సమావేశం సాదాసీదాగా జరిగినప్పటికీ, కొంతకాలంగా జెడ్‌పి సర్వసభ్య సమావేశం తన ప్రాభవాన్ని కోల్పోయింది. మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంపీలు పాల్గొని జిల్లా సమస్యలపై ప్రధానంగా చర్చించి నిర్ణయం తీసుకోవడంతోపాటు ముఖ్యమైన అంశాలపై తీర్మానాలు చేసేవారు. గడిచిన మూడేళ్లలో ఒకటి, రెండు సమావేశాలు మాత్రమే కొంత మెరుగ్గా జరిగాయి. తర్వాత ఒకరిద్దరు ఎంఎల్‌ఎలు మినహా, మిగిలిన వారు సమావేశాలకు రావడం మానేశారు. జిల్లాల విభజన నేపథ్యంలో మూడు జిల్లాలు ఏలూరు, పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల కలెక్టర్లు హాజరు కావాల్సి ఉన్నప్పటికీ ఏలూరు జిల్లా కలెక్టర్ మాత్రం పూర్తిస్థాయిలో, ఒకటి, రెండుసార్లు పశ్చిమ కలెక్టర్ మాత్రమే హాజరయ్యారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి కలెక్టర్ ఒక్కసారీ హాజరుకాని పరిస్థితి నెలకొంది. అధికారుల హాజరుపై సభ్యులు అనేకసార్లు నిలదీశారు. మూడు నెలలకోసారి సమావేశం నిర్వహించాలన్న నిబంధన నేపథ్యంలోనే శనివారం జెడ్‌పి సర్వసభ్య సమావేశం నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ కెఎస్-ఎస్.సుబ్బారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరి విత్తనాలు సీజ్

ప్రజాశక్తి - ఆచంట

వరి విత్తనాలను అక్రమంగా నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఏలూరు రీజినల్ విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి కరణం కుమార్ హెచ్చరించారు. ఆచంటలో శనివారం అనుమతులు లేని గోడౌన్‌లో వరి విత్తనాలు నిల్వ చేసినట్లుగా వచ్చిన విశ్వసనీయ సమాచారం ప్రకారం తనిఖీ చేశారు. వారి ఆదేశాల మేరకు పెనుగొండ మండలం, చినమల్లం గ్రామానికి చెందిన మేస్సేర్స్ శ్రీధాన్య లక్ష్మి సీడ్స్‌నకు సంబంధించి అనుమతులు లేకుండా ఆచంట గ్రామంలో ఉన్న గోడౌన్‌లో విజిలెన్సు అధికారులు, మండల వ్యవసాయ శాఖ అధికార్లు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 2590.20 క్వింటాల్ వరి విత్తనాలు గుర్తించి యజమాని దమ్మా రవీంద్రపై నిత్యావసరాల చట్టం 1955, క్లాజ్ 13(1) సీడ్ కంట్రోల్ ఆర్డర్ 1983 ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ తనిఖీలో విజిలెన్సు వ్యవసాయ శాఖాధికారి పి.సురేష్, విజిలెన్సు ఎస్ఐ సిహెచ్. రంజిత్ కుమార్, విజిలెన్సు ఎఇఇ ఎం.రూపేష్ వర్మ, మండల వ్యవసాయ శాఖాధికారి జి.సత్యనారాయణ ఉన్నారు.

రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించండి

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం నిర్వాహకులు రుచికరమైన, నాణ్యమైన భోజనం వడ్డించాలని విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.సత్యనారాయణ అన్నారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని శనివారం వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ వంటల తయారీ సమయంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు ఆప్యాయంగా వడ్డించాలన్నారు. వంటల తయారీ విధానంపై ఉదయం, మధ్యాహ్నం భోజనం రోజువారి మోనూప్రకారం వంటల పోటీ నిర్వహించి వారికి బహుమతులు ఇచ్చారు. ప్రథమ బహుమతి మత్స్యపురి కాంప్లెక్స్, ద్వితీయ బహుమతి వీరవాసరం కాంప్లెక్స్, తృతీయ బహుమతి తోలేరు కాంప్లెక్స్ వారు పొందారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఎంఎన్.శ్రీమన్నారాయణ, జిల్లా ఎండిఎం పారిశుద్ధ్య కో ఆర్డినేటర్ జి.చిన్నయ్య, కె.కృష్ణారావు, ప్రధానోపాధ్యాయుడు జె.శ్రీనివాస్, విషయ నిపుణులు ఎ.సరళ, వివిసి దేవి, ఎం.మౌనిక పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రంకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నరసాపురం

వాసవి క్లబ్ నరసాపురం వారు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మజ్జిగ చలివేంద్రమునకు హనుమత్ జయంతి సందర్భంగా అప్పన రమేష్, ఆత్మూరి లక్షిత్ రాజగోపాల్ ఆర్థిక సాయం చేసి నిర్వహించారు. 38 రోజులుగా పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో చలివేంద్రం కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ జల్లూరి శ్రీనివాస్, సెక్రటరీ సత్యనారాయణ, ట్రెజరర్ నవీన్ గుప్తా, చలివేంద్ర కమిటీ ఛైర్మన్, రాతికింది వెంకట ప్రసాద్, అప్పన రమేష్, సాక్షి న్యూస్ చానల్ రిపోర్టర్ కోట్ల బాలకృష్ణ పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయునికి ఉద్యోగ విరమణ సన్మానం

ప్రజాశక్తి - పెనుమంట్ర

వ్యాయామ ఉపాధ్యాయుడిగా 38 సంవత్సరాల పాటు సేవలు అందించిన ఎర్ర కాశీ విశ్వేశ్వరరావుకు మార్టేరు బాస్కెట్ బాల్ క్రీడా ప్రాంగణంలో ఫ్లడ్ లైట్ వెలుగులో పదవీ విరమణ సన్మానం చేశారు. మార్టేరు యూత్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్, పిఆర్ బాస్కెట్‌బాల్ ట్రస్ట్, మానవత సేవా సంస్థల ఆధ్వర్యంలో స్థానిక శ్రీవేణుగోపాల ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో కాశీ మాస్టార్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎస్‌సి మాజీ సూపర్నెంట్ లక్ష్మణరావు, రిటైర్డ్ ఒన్‌జిసి ఎంప్లాయిస్ శ్రీనివాస్ రెడ్డి, కడలి వెంకటేశ్వరరావు, మానవత జిల్లా కార్యదర్శి కొత్త సత్యనారాయణ మూర్తి, ప్రధానోపాధ్యాయులు సిహెచ్.చిన సూర్యనారాయణ రెడ్డి, అంతర్జాతీయ క్రీడాకారుడు సుబ్బన్న రెడ్డి, మునిబాబు, సొసైటీ అధ్యక్షులు అల్లం భాస్కర్ రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.



అన్నసమారాధనలో యాత్రికులు

పలుచోట్ల అన్న సమారాధన

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కాళ్లకూరు గ్రామంలో స్వయంభూ శ్రీవేంకటేశ్వర స్వామివారి కళ్యాణమహోత్సవాలు ముగిసిన సందర్భంగా శనివారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. దాతలు, యాత్రికుల ఆర్థిక సహకారంతో దేవస్థానం ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది. శనివారం కావడంతో ఆలయం యాత్రికులతో కిటకిట లాడింది. వివిధ గ్రామాల నుంచి పెద్దఎత్తున యాత్రికులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. యాత్రికులు, దాతలు, గ్రామస్తుల సహాయ సహకారాలతో యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి, ఆలయ ఇఒ ఎం.అరుణ్ కుమార్, సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన మాజీ ఛైర్మన్‌లు దండు వెంకట కృష్ణంరాజు, అడ్డాల గణపతి రాజు, పెన్మెత్స రాజా, గ్రామ పెద్దలు, ధర్మకర్త మండలి మాజీ సభ్యులు పాల్గొన్నారు.

పాలకొల్లు: పాలకొల్లు పట్టణంలో హనుమాన్ జయంతి సందర్భంగా పలు ఆలయాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు. యడ్ల బజార్‌లోని పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆలయం, కెనాల్ రోడ్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలను ప్రత్యేక అలంకరణ చేశారు. టిటిడి సభ్యులు మేకా శేషుబాబు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంకా రైల్వే గేటు సెంటర్, లాకులు వద్ద కూడా అన్నసమారాధన నిర్వహించారు. పాలకొల్లు పట్టణంలో దేశాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ వీరికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు చందక సత్తిబాబు, జనసేన పట్టణ అధ్యక్షులు శిడగం సురేంద్ర పాల్గొన్నారు.

మొగల్తూరు: మొగల్తూరులోని భక్తాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం భారీ అన్న సమరాధన చేశారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని స్వామివారికి సహస్రనామం, అష్టోత్తరం, తమలపాకులతో ప్రత్యేక పూజలు, వివిధ రకాల పళ్ల రసాలతో అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అఖండ అన్న సమారాధనలో అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు.

ముత్యాలపల్లి, కాళీపట్నం, పేరుపాలెం, సీతారామపురం తదితర గ్రామాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పలుచోట్ల భారీ అన్నసమారాధన చేశారు.

పెనుమంట్ర : హనుమాన్ జయంతి సందర్భంగా నత్తారామేశ్వరంలోని శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఆంజనేయస్వామికి విశేష పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కాగా మండలంలోని మార్టేరు, నెగ్గిపూడి, వనంపల్లి, పొలమూరు, పెనుమంట్ర, వెలగలవారిపాలెం, తదితర పలు గ్రామాల్లోకి రామాలయాల్లోను, ఆంజనేయ స్వామి విగ్రహాలువద్ద భక్తులు పూజలు చేశారు. పలుచోట్ల ప్రసాదాలతో పాటు అన్న సమారాధన నిర్వహించారు.

వేసవి శిబిరంలో 'చదవడం-మాకిష్టం'

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో నిర్వహించబడుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం 'చదవడం-మాకిష్టం' ప్రోగ్రాంలో నీతి కథలు, సింహము-ఎలుక, పరమానందయ్య శిష్యుల కథలు, కుక్క..మాంసపు ముక్క తదితర నీతి కథలను పిల్లలకు వీడియో ద్వారా రిసోర్స్ పర్సన్ జీవన్ కుమార్ చూపించారు. చిత్రలేఖనం ఆర్టిస్టు తోట శ్రీనివాస్ , కరాటేలో టి.కృష్ణ శిక్షణ ఇచ్చారు. తదనంతరం పిల్లలకు రైమ్స్ పాటలు, ఆటలు ఆడించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రంగినీడి సుబ్బారావు, జ్ఞాన ప్రకాష్, సుదీర్మోహన్, సూర్యం బాబు, శ్రీనివాస్ మాస్టర్, ప్రవీణ్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈనెల 7వ తేదీన ముగింపు సభ జరుగుతుందని గ్రేడ్‌వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్.కుమారి తెలిపారు.

వ్యవసాయ డిప్లమో కోర్సులకు నోటిఫికేషన్ విడుదల

మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం ఎడిఆర్ డాక్టర్ డి.శ్రీనివాస్ వెల్లడి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా నిర్వహించే వ్యవసాయ డిప్లొమో కోర్సులకు నోటిఫికేషన్ విడుదలైందని మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం ఎడిఆర్ డాక్టర్ ధన్యంరాజు శ్రీనివాస్ వెల్లడించారు. ఈనెల 1 నుంచి 20వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కోర్స్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి టెన్త్ పాస్ లేదా ఇంటర్ ఫెయిల్ విద్యార్హత అన్నారు. ఇంటర్ పాస్ అయిన వారు చేసుకో రాదని స్పష్టం చేశారు. అభ్యర్థులు 2009 ఆగస్టు 31 నుంచి 2022 ఆగస్టు 31 లోపు జన్మించిన వారై ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంగ్లీష్ మీడియంలో చదివిన వారికి, మున్సిపాలిటీ ప్రాంతాల్లో చదివిన వారికి 75-25 నిష్పత్తిలో సీట్లు కేటాయింపు ఉంటుందని, కోర్సు పూర్తిగా ఇంగ్లీష్ మీడియం అని తెలిపారు. మరిన్ని వివరాల కోసం www.angrau.ac.inను వీక్షించాలని, స్థానికులకు సందేహాలు ఉంటే మార్టేరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో గానీ, వ్యవసాయ పాలిటెక్నిక్ కార్యాలయంలో గానీ, ప్రిన్సిపాల్ ఫోన్ నెం.08819-297297కు కార్యాలయం వేళల్లో సంప్రదించవచ్చని ఎడిఆర్ శ్రీనివాస్ తెలిపారు.

సామాన్యులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

వెలగలేరు(మార్టేరు) విద్యార్థి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కార్యదర్శి, కరస్పాండెంట్ పడాల వెంకటరెడ్డి



ప్రజాశక్తి - పెనుమంట్ర

గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థుల కోసమే తాము విద్యార్థి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఏర్పాటు చేసామని స్కూల్ కార్యదర్శి, కరస్పాండెంట్ పడాల వెంకటరెడ్డి అన్నారు. పెనుమంట్ర మండలంలోని మార్టేరు పంచ గ్రామాల్లో ఒకటి అయిన వెలగలేరు గ్రామంలో 2009-10 విద్యా సంవత్సరంలో ఎల్‌కెజి నుంచి 10వ తరగతి వరకూ విద్యను అందించేలా తరగతులు ప్రారభించామని వారు తెలిపారు. సామాన్య, మధ్య తరగతికి చెందిన కుటుంబాల నుంచి వచ్చిన పిల్లలకు నాణ్యమైన విద్యను తక్కువ రుసుముతో అందించడమే తమ విద్యార్థి విద్యాసంస్థ లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. ప్రారంభం నుంచి 10/10 గ్రేడులు, నూటికి 90 నుంచి వంద శాతం ఫలితాలతో విద్యార్థులు మండల స్థాయి, టౌన్ స్థాయిల్లో ముందున్నారని పేర్కొన్నారు. దూర ప్రాంత విద్యార్థుల కోసం రెండు బస్సులు ఉన్నాయని, శిక్షితులైన ఉపాధ్యాయులు, పర్యవేక్షణ, చక్కటి వాతావరణం మధ్య మంచి బోధన అందిస్తున్నామని వారు వెల్లడించారు.



కరస్పాండెంట్ వెంకటరెడ్డి

తమ పాఠశాల నుంచి 2020 విద్యా సంవత్సరంలో చెల్లబోయిన వినీత(556), 2021లో ఇళ్ల అనంత(578) మార్కులు సాధించగా ఇటీవల 2024 టెన్త్ ఫలితాల్లో పెసల లక్ష్మీ నాగ సహస్ర 582 మార్కులతో మండలం ద్వితీయ, టౌన్ ప్రథమ స్థానం సాధించిందని వారు తెలిపారు.



లక్ష్మీ నాగ సహస్ర

ఇదే పాఠశాలలో 10వ తరగతి చదివిన కార్యదర్శి, కరస్పాండెంట్ పడాల వెంకటరెడ్డి, సుధారాణి దంపతుల కుమార్తె సంతోషి నాగ పద్మశ్రీ తోటి విద్యార్థులను ప్రోత్సహిస్తూ, తాను 554 మార్కులు పొందడం విశేషం. సొంత కుమార్తెకు టాప్ మార్క్ కోసం కాకుండా, మొత్తం పాఠశాల విద్యార్థులందరూ మంచి మార్కులు తెచ్చుకోవాలని తాము కృషి చేసి, మంచి ఫలితాలు సాధించామని, ఈ ఘనత ఉపాధ్యాయ బృందానిదే అని వారు తెలియజేశారు.



సంతోషి నాగ పద్మశ్రీ

పంచాయతీ కార్యదర్శుల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని ఏలూరుపాడు, కలవపూడి గ్రామ పంచాయతీ కార్యదర్శులుగా అరుణదేవి, సాత్వికం బాధ్యతలు స్వీకరించారని ఎంపిడిఒ ఎంవి.భాస్కరరావు శనివారం తెలిపారు. ఎస్.అరుణదేవి ఉణుదుర్రు గ్రామపంచాయతీ నుంచి బదిలీపై ఏలూరుపాడు పంచాయతీ కార్యదర్శిగా వచ్చారు. ఎం.సాత్వికం చిలుకూరు గ్రామ పంచాయతీ నుంచి బదిలీపై కలవపూడి గ్రామ కార్యదర్శిగా బాధ్యత స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ, పంచాయతీ సిబ్బంది అందరూ కలిసి ఏలూరుపాడు గ్రామ పంచాయతీ అభివృద్ధికి పనిచేస్తామని, ప్రజలకు అందుబాటులో ఉంటానని కోరారు. ఎం.సాత్వికం మాట్లాడుతూ కలవపూడి గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

వృద్ధులకు కంటి శస్త్ర చికిత్స

ప్రజాశక్తి - పాలకొల్లు



శస్త్ర చికిత్స చేసుకున్న వృద్ధులు

వాకర్స్ క్లబ్ పాలకొల్లు ఆధ్వర్యంలో ఆరుగురు పేద వృద్ధులకు స్థానిక లయన్స్ కంటి ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు చేయించారు. క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు శనివారం ఆసుపత్రి ఆవరణలో వారికి పండ్లను అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, జవ్వాజి కళ్యాణ్ పాల్గొన్నారు.

జగన్మోహన్ రెడ్డిని కలిసిన ముదునూరి

ప్రజాశక్తి - నరసాపురం

విదేశీ పర్యటన ముగించుకుని విజయవాడ చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తొలుత గన్నవరం విమానాశ్రయం చేరుకున్నారు. విజయవాడలో శనివారం తెల్లవారుజామున జగన్ మోహన్ రెడ్డిని ప్రభుత్వ చీఫ్ విప్, ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు.

వీరవల్లి కుటుంబాన్ని పరామర్శించిన పితాని

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని జుత్తిగ గ్రామంలో వీరవల్లి రాంబాబు, సత్యనారాయణ సోదరుల తల్లి వీరవల్లి మహాలక్ష్మి గత రెండు నెలలుగా కొద్దిపాటి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందారు. శనివారం మాజీ మంత్రి పితాని సత్యనారాయణ వీరవల్లి సోదరుల కుటుంబసభ్యులను పరామర్శించి, మహాలక్ష్మి చిత్రపటానికి నివాళులు అర్పించారు. మాజీ మంత్రి పితాని వెంట మాజీ ఎంఎంసి ఛైర్మన్ సానబోయిన గోపాలకృష్ణ, నల్లమిల్లి నర్సిరెడ్డి, నీటి సంఘం మాజీ ఛైర్మన్ వెలగల బుల్లి రామిరెడ్డి, గొలుగూరి శ్రీనివాస్ రెడ్డి, కొవ్వూరి సోమ భాస్కర్ రెడ్డి, గుడిమెట్ల సుందర్ రామిరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, దండు రామరాజు, పులగం సుబ్బారెడ్డి, కోడమంచిలి యేసు ఉన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కల్గించొద్దు

ప్రజాశక్తి - గణపవరం

నిడమర్రు సర్కిల్ పరిధిలో 144 సెక్షన్, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని అందువల్ల బహిరంగ ప్రదేశాల్లో ఐదుగురు అంటే ఎక్కువగా గుంపులుగా ఉండకూడదని నిడమర్రు సిఐ ఎంవి.సుభాష్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 4వ తేదీ ఓట్లు లెక్కింపు సందర్భంగా ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు, బాణాసంచా కాల్చడం, పబ్లిక్ మీటింగులు ఏర్పాటు చేయడానికి ఎటువంటి అనుమతులు లేవని అన్నారు. రాజకీయ నాయకులు ఎటువంటి బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించకూడదని చెప్పారు. ఉద్దేశపూర్వకంగా ప్రత్యర్థి పార్టీ నాయకులను, కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం, సోషల్ మీడియాలో వదంతులు ప్రసారం చేయడం నేరమని అన్నారు. అలా చేసిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిడమర్రు సర్కిల్ పరిధిలో గణపవరం, నిడమర్రు, చేబ్రోలు స్టేషన్ పరిధిలో ఏడు సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి వివిధ రాజకీయ పార్టీల వ్యక్తులతో శాంతి కమిటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల నియమాలికి విరుద్ధంగా గొడవలు పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సర్కిల్ పరిధిలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించి అనుమానం ఉన్న వ్యక్తులకు సంబంధించిన అనాధికారంగా ఉన్న 50 వాహనాలను గుర్తించి వాటిని సీజ్ చేసినట్టు చెప్పారు. ఈనెల 4వ తేదీన ఓట్లు లెక్కింపు రోజున ఎవరైనా హింసాత్మక సంఘటనలకు పాల్పడితే కేసు నమోదు చేసి, రౌడీషీట్లు ఓపెన్ చేసి, వారి పేర్లు ఎన్నికల నేరస్తుల జాబితాలో చేరుస్తామని అన్నారు. కౌంటింగ్ రోజున సర్కిల్ పరిధిలో వందమంది పోలీస్ సిబ్బందితో, నాలుగు క్యూఆర్‌టి టీములు, మూడు మొబైల్ పార్టీలు 14 ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు హింసాత్మక చర్యలకు పాల్పడకుండా అందరూ శాంతి భద్రత పరిరక్షణలో పోలీసు వారికి సహకరించాలని కోరారు.

ఉండి: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడనున్న నేపథ్యంలో నియోజకవర్గంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ చట్టవ్యతిరేక పనులు ఎవరైనా చేస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని అడిషనల్ ఎస్‌పి బాషా సూచించారు. శనివారం సాయంత్రం ఉండి మెయిన్ సెంటర్‌ను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు విడుదలైన తర్వాత విజయోత్సవ ర్యాలీలు నిర్వహిస్తూ, వేరే పార్టీని విమర్శించి విద్వేషాలు రగిలించేలా మాట్లాడి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. నియోజకవర్గంలో 144 సెక్షన్ అమలులో ఉందని ఎవరైనా గుంపులుగా తిరిగినట్లయితే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట రైల్వే డిఎస్‌పి నాగేశ్వరరావు, ఉండి ఎస్ఐ ఎం.లక్ష్మణ్, ఎఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ ఉన్నారు.

ఎగ్జిట్ పోల్ ఫలితాలు నమ్మవద్దు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల పట్ల శనివారం సాయంత్రం నుంచి వెలువడుతున్న ఎగ్జిట్ పోల్ ఫలితాలపై జాగ్రత్తగా ఉండాలని, వాటిని నమ్మవద్దని వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులను పెనుమంట్ర ఎంపిపి కర్రి వాసు రెడ్డి కోరారు. ఎక్కడా బాణసంచా కాల్చడం, ఊరేగింపులు చేయడం వంటి చేష్టలు లేకుండా అందరూ పోలీస్ వారికి సహకరించాలని ఆయన అన్నారు. ఈనెల 2వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు తూర్పుపాలెంలోని వైసిపి కార్యాలయంలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో జరిగే కౌంటింగ్ ఏజెంట్ల సమావేశానికి అందరూ హాజరు కావాలని వాసు రెడ్డి కోరారు.

విద్యార్థుల భవిష్యత్తుకు పాటుపడిన శాంతకుమారి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

డిఎన్ఆర్ కళా శాల అధ్యాపకులుగా డాక్టర్ బివిఎస్.శాంతకుమారి ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తుకు పాటుపడ్డారని కళాశాల సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణ రాజు అన్నారు. శాంతకుమారి పదవీ విరమణ సందర్భంగా శనివారం కళాశాలలో ఆమెను యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా గాదిరాజు మాట్లాడుతూ డాక్టర్ బివిఎస్.శాంత కుమారి కరోనా కల్లోల పరిస్థితుల్లో సైతం కళాశాల అభివృద్ధికి కృషి చేశారని, ఎందరో విద్యార్థుల భవిష్యత్తుకు పాటు పడ్డారన్నారు. పాలకవర్గ ఉపాధ్యక్షులు గోకరాజు పాండు రంగ రాజు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా కళాశాలలో అన్ని కార్యక్రమాలు సజావుగా సాగడంలో తనదైన ముద్రను వేశారన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించిన జి.మోజెస్ అధ్యక్షత వహించారు. శాంతకుమారి సేవలను పాలకవర్గ సంయుక్త కార్యదర్శి కె.రామకృష్ణంరాజు, సహాయ కార్యదర్శి కె.శివ రామ రాజు, పాలకవర్గ సభ్యులు దత్తాత్రేయ వర్మ, పి.రామకృష్ణంరాజు, స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బివి.నరసింహ రాజు, గవర్నింగ్ బాడీ స్టాఫ్ రెప్రజెంటేటివ్ డాక్టర్ ఎ.వీరయ్య, కోశాధికారి పి.హరికృష్ణంరాజు, తదితర సిబ్బంది కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల వివిధ శాఖాధిపతులు పాల్గొన్నారు.

ఎగ్జిట్ పోల్ ఫలితాలు నిజమేనా?

నరసాపురం:ఎగ్జిట్ పోల్ ఫలితాలు నిజమేనా? అనే ప్రశ్న అందరిలోనూ మొదలైంది. శనివారం సాయంత్రం విడుదలైన ఎగ్జిట్ పోల్ సర్వేలు రాష్ట్రంల ఒక సర్వే సంస్థ కూటమి అధికారంలోకి వస్తుంది అంటే, మరొక సంస్థ వైసిపి అధికారంలోకి వస్తుందని చెబుతున్నాయి. పందెం రాయుళ్ల సర్వేలు విడుదలైనప్పటి నుంచి తలలు పట్టుకుంటున్నారు. ఆయా పార్టీ నాయకులు, కార్యకర్తలు అయోమయంలో పడ్డారు. ఈనెల 4వ తేదీన ఇలానే వస్తాయి కదా అని కొందరు ధైర్యంగా ఉన్నారు. ఎవరికి వారు సాయంత్రం ఆరు అయ్యేటప్పటికి ప్రజలందరూ టివిలకు, ఫోన్‌లో సర్వే ఫలితాలు కోసం ఎదురు చూశారు. రాజకీయ పార్టీల నాయకులు ఎవరికి వారు తమ పార్టీ గెలుస్తుందని సోషల్ మీడియాలో పోస్టులు పోస్ట్ చేస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పట్టణ పోలీసులు పలు సెంటర్లలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, నర్సాపురం

E.P. No. 7/2020 in O.S. No. 203/2017

వేలం ప్రకటన

Between:

DHR: సత్తి అమ్మిరెడ్డి

Vs

JDR: రేవు సోమరాజు

పై నెంబరు దావాలో JDR కు సంబంధించిన స్థిరాస్తిని (1-9 సెంట్లు) సర్వే నెంబరు 245/6 గల చేపల చెరువును **ది. 18-6-2024వ తేదీన** నర్సాపురం శ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో వేలం వేయుదురు. గాన పత్రికా ముఖంగా తెలియజేయుచున్నాము.

స్థిరాస్తి షెడ్యూలు (చేపల చెరువు)

An extent of Ac. 1-09 cents of land (Prawn tank) in 245/6, situated at Kalipatnam, Pathapadu Panchayat, Mogalturu Mandal, Mogalthuru Sub-Registry, W.G.Dt. is bounded by:

EAST: Panta Bodi

SOUTH: Land belongs to Revu Nagamani

WEST: Murugu Bodi

NORTH: Land belongs to Koppadi Balakrishna

Within the above boundaries an extent of Ac. 1-09 cents of land (Prawn tank) along with drain water facilities and with all easementary rights and joint way etc.,

అమీనా వాల్యూ: రూ. 19,00,000/-

మార్కెట్ వాల్యూ: రూ. 14,17,000/-

DHR వాల్యూ: రూ. 3,00,000/-

MADDALA HARICHANDRUDU

Advocate, Bhimavaram

మహారాజశ్రీ నర్సాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No. 142/2018

Between:

మండెల సత్యనారాయణ -వాది

మరియు

పడవల లలిత భ్రమరాంబ కుమారి వగైరా -ప్రతివాదులు

టు:

1వ ప్రతివాది: శ్రీమతి పడవల లలిత భ్రమరాంబ కుమారి, భర్త: లేటు శివన్నారాయణ, రామన్నపాలెం, మొగల్తూరు మండలం, ప॥గో॥జిల్లా.

2వ ప్రతివాది: శ్రీమతి వానపల్లి గీత, భర్త: చిరంజీవి పవన్‌కుమార్, గుంతకల్లు, అనంతపురం జిల్లా.

3వ ప్రతివాది: శ్రీ సత్య ఫైనాన్షియల్ సర్వీసెస్, లక్ష్మణేశ్వరం, Rep. by its Prop: మేకా శ్రీధర్ చౌదరి

పై నెంబరు దావాలో ప్రతివాదులైన మీకు ఎన్నిసార్లు కోర్టు ద్వారా దావా సమన్లు పంపించినను మీరు ఉద్దేశ్యపూర్వకంగా పుచ్చుకొనుట లేదు. కావున కోర్టు వారి ఉత్తర్వుల మేరకు మీకు తెలియజేయునది ఏమనగా, పై నంబరు దావా మీ హాజరు నిమిత్తం **ది. 27-6-2024 సం॥ తేదీ నాటికి కోర్టు వారు వాయిదా వేసియున్నారు.** పై నంబరు దావాలో మీకు ఏవిధమైన వాదన యున్ననూ సదరు తేదీన పై కోర్టు వారి ఎదుట **ఉదయం 10.30 ని॥లకు** స్వయంగా గాని, అడ్వకేటు వారి ద్వారా గాని హాజరై సంజాయిషీ తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

పోలిశెట్టి వీర వెంకట నారాయణస్వామి

నర్సాపురం అడ్వకేట్, నర్సాపురం, ప॥గో॥జిల్లా

ది.28-5-2024 సెల్: 9866094606

వేలం ప్రకటన

మహారాజశ్రీ 7వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా

EP No: 1769/2018 in ARB case No.KB/SF/65 of 2016

Between:

M/s. Sundaram Finance Ltd.

...Petitioner/Dhr

and

Mr. Kontala Venkateswara Rao

Mr. Badaravada Appalaraju

Mr. Kontala Uma Devi

...Respondents/JDR's

పై నెంబరు గ్రంథములో డిక్రీ బాకీ రాబట్టుకునే నిమిత్తం JDR-2 Mr. Badaravada Appalaraju గారి ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టు వారి ఎదుట **ది. 18-06-2024**వ తేదీన బహిరంగ వేలం వేయబడును. ఆ రోజు ఉదయం 10.30 ని॥లకు శ్రీకోర్టు వారి ఎదుట హాజరు అయ్యి ఎవరైననూ వేలం పాటలో పాల్గొని స్థిరాస్తిని వేలం పాటలో పాడుకొన వచ్చును.

షెడ్యూలు ఆస్థి వివరములు

The site in an extent of 117-00 Sq.yards out of Ac.0.24 Cents in R.S.No.56/16 of Bhimadole Village, Nearest D.No.14-128 vacant site of and Bhimadole Village, Bhimadole Panchayati, Bhimadole Mandal, Bhimadole Sub-Registry, West Godavari District, being bounded by:

East: Sunyamu

South: 10 feet road, 61

West: B.Appalarajus site 33 F

North: Houses of Gottapu Satyanarayana and other 67 F

Between the above boundaries vacant site in an extent of 117-00 Sq.yards with all easement rights etc.

Ameena Value: 25,00,000/-

B.J.Reddy, B.A. Reddy,

Advocates, Eluru.

Place: Eluru
Date: 31-05-2024 Cell: 97032 34999

పేరు మార్పు

ఏలూరు జిల్లా, పడమర వీధి, కొత్త గంగానమ్మ గుడి వెనకాల, డోర్ నెం. 3సి-17-10/1కు చెందిన మీనంబాకం రామచంద్రరావు, S/o. జయరామ్ (లేటు) అను నా యొక్క పేరు **మీనంబాకం రామ్‌చంద్రరావు** (పాతది) పాస్‌పోర్టులో తప్పుగా ఉంది. పాస్‌పోర్టు నెంబర్ **E8433127.** కావున **మీనంబాకం రామచంద్రరావు** (కొత్త పేరు) ను పాస్‌పోర్టులో అన్ని డాక్యుమెంట్స్‌కి మార్చవలసిందిగా కోరుచున్నాను.

మీనంబాకం రామచంద్రరావు
S/o. జయరామ్
3సి-17-10/1, పడమర వీధి,
గంగానమ్మ గుడి వెనకాల, ఏలూరు జిల్లా

IN THE COURT OF THE HONBLE ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) ELURU, W.G.DIST.

I.A.No.483/2022 in O.S.No.51/2022

Between:

Kolusu Srisaka Mallikarjuna Rao ...Petitioner

&

Sunkara Sidhananda Anjaneyulu & Others ...Respondents

R1: Sunkara Sidananda Anjaneyulu, S/o.Kanaka Rao, R/o.D.No.5-21/8, Patamata, Vijayawada, Krishna Dist.

R2: Mangam Saraswathi Kumari, D/o.Trinath, R/o.D.No.3-176, Sunkaravari Thota, Venkatapuram Panchayathi, Eluru.

R4: Mangam Saraswathi Kumari, D/o.Trinatha Rao, R/o.Do.B-2/1, 6th ward Rama Colony, Eluru.

R5: Naidu Rama lakshmi, W/o.Nageswara vara prasad, R/o.D.No.7B-14-15, New Postal colony, Chataparu Road, Venkatapuram Panchayathi, Eluru.

R6: Mekala Nagamani, W/o.Satyanarayana, R/o.Do.6-19-18, Bavisettivaripeta, Eluru.

R9: Tadiparthi Koteswara Rao, S/o.Kantha Rao, R/o.Do.18-28-64/125, Chinaranganipalem Village, Bhimavaram Mandal, W.G.Dist.

R10.Jagarlamudi Siva Krishna, S/o.Nageswara Rao, R/o.D.No.3D-12-32, Arundatipeta, Padamaraveedhi, Eluru.

R12: Bale Vijaya Babu, S/o.Suryanarayana Raju, R/o.D.No.2-46, Chinaranganipalem Village, Bhimavaram Mandal, W.G.Dist.

R13: Anam Bhimaraju, S/o.Nageswar Rao, R/o.D.No.2-15-4, Madepalli Village, Eluru.

R14: Pachipala Veera Venkata Siva Satyanarayana, S/o.Krishna Rao, R/o.D.No.7-14-5/1, 39th Division, Tangellamudi, Eluru.

R16: Samudarala leela Maheswara Rao, S/o.Venkata Madhusudhan Rao, GPA Agent, R/o.R.R.Peta, Eluru.

పై నెంబరు దావాలో పై ప్రతివాదులకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున పై కోర్టు వారు R.1,R.2, R.4, R.5, R.6, R.9, R.10, R.12, R.13, R.14, R.16 ప్రతివాదులు అయిన మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా దావా నోటీసులు అమలు చేయుటకు ఆర్డరు వేసియున్నారు. పై దావా **ది.28.6.2024**వ తేదీ ఉదయం గం.10.30 ని॥కు శ్రీకోర్టుకు హాజరు అయి మీ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనియెడల దావా మీ పరోక్షమున విచారించబడును.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఎన్.వై.వి.ప్రసాద్, ఎన్.రాముడు

ఏలూరు అడ్వకేట్స్, ఏలూరు.

22-5-2024 సెల్: 7780194120

IN THE COURT OF THE HONBLE ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) ELURU, W.G.DIST.

I.A.No.659/2023 in O.S.No.33/2022

Between:

Methukumilli Rama Tulasi ...Petitioner

&

Marumudi Venkamma & Others ...Respondents

R10: Marumudi Raju, S/o.(Late) Venkateswara Rao, R/o.D.No.4-14, Madepalli Village, Eluru Mandal, Eluru Dist.

R11: Ammireddy Prasad, S/o.(Late) Nageswara Rao, R/o.D.No.9-149, Indira Nagar, Bapulapadu Village, Krishna Dist.

పై నెంబరు దావాలో పై ప్రతివాదులకు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున పై కోర్టు వారు R.10, R.11 ప్రతివాదులు అయిన మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా దావా నోటీసులు అమలు చేయుటకు ఆర్డరు వేసియున్నారు. పై దావా **ది.19.6.2024**వ తేదీ ఉదయం గం.10.30 ని॥కు శ్రీకోర్టుకు హాజరు అయి మీ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనియెడల దావా మీ పరోక్షమున విచారించబడును.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఎన్.వై.వి.ప్రసాద్, ఎన్.రాముడు

ఏలూరు అడ్వకేట్స్, ఏలూరు.

22-5-2024 సెల్: 7780194120

IN THE COURT OF THE HONBLE ADDL. JUDGE (SENIOR DIVISION) ELURU, W.G.DIST.

O.S.No.5/2022

Between:

Methukumilli Rama Tulasi ...Plaintiff

&

Sirangi Danayya & Others ... Defendant

D1: Sirangi Danayya, S/o.Galleb, R/o.Do.3-2-51, Sunkaravari Thota, Venkatapuram Panchayat, Eluru Rural Mandal, W.G.Dist.

పై నెంబరు దావాలో పై ప్రతివాదులకు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపినను తీసు కొనక కాలయాపన చేయుచున్నారు. కావున పై కోర్టు వారు D.1 ప్రతివాదులు అయిన మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా దావా నోటీసులు అమలు చేయుటకు ఆర్డరు వేసియున్నారు. పై దావా **ది.28.6.2024** వ తేదీ ఉదయం గం.10.30 ని॥కు శ్రీకోర్టుకు హాజరు అయి మీ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనియెడల దావా మీ పరోక్షమున విచారించబడును.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఎన్.వై.వి.ప్రసాద్, ఎన్.రాముడు

ఏలూరు అడ్వకేట్స్, ఏలూరు.

22-5-2024 సెల్: 7780194120

IN THE COURT OF THE HONBLE ADDL. JUDGE (SENIOR DIVISION) ELURU, W.G.DIST.

I.A.No.39/2022 in O.S.No.5/2022

Between:

Methukumilli Rama Tulasi ...Petitioner

&

Sirangi Danayya & Others ...Respondent

R1: Sirangi Danayya, S/o.Galleb, R/o.Do.3-2-51, Sunkaravari Thota, Venkatapuram Panchayat, Eluru Rural Mandal, W.G.Dist.

పై నెంబరు దావాలో పై ప్రతివాదులకు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపినను తీసు కొనక కాలయాపన చేయుచున్నారు. కావున పై కోర్టు వారు R.1 ప్రతివాదులు అయిన మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా దావా నోటీసులు అమలు చేయుటకు ఆర్డరు వేసియున్నారు. పై దావా **ది.28.6.2024** వ తేదీ ఉదయం గం.10.30 ని॥కు శ్రీకోర్టుకు హాజరు అయి మీ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనియెడల దావా మీ పరోక్షమున విచారించబడును.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఎన్.వై.వి.ప్రసాద్, ఎన్.రాముడు

ఏలూరు అడ్వకేట్స్, ఏలూరు.

22-5-2024 సెల్: 7780194120

IN THE COURT OF THE HONBLE ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) ELURU, W.G.DIST.

O.S.No.51/2022

Between:

Kolusu Srisaka Mallikarjuna Rao ...Plaintiff

&

Sunkara Sidhananda Anjaneyulu & Others ...Defendants

D1: Sunkara Sidananda Anjaneyulu, S/o.Kanaka Rao, R/o.D.No.5-21/8, Patamata, Vijayawada, Krishna Dist.

D2: Mangam Saraswathi Kumari, D/o.Trinath, R/o.D.No.3-176, Sunkaravari Thota, Venkatapuram Panchayathi, Eluru.

D4: Mangam Saraswathi Kumari, D/o.Trinatha Rao, R/o.Do.B-2/1, 6th ward Rama Colony, Eluru.

D5: Naidu Rama lakshmi, W/o.Nageswara vara prasad, R/o.D.No.7B-14-15, New Postal colony, Chataparu Road, Venkatapuram Panchayathi, Eluru.

D6: Mekala Nagamani, W/o.Satyanarayana, R/o.Do.6-19-18, Bavisettivaripeta, Eluru.

D9: Tadiparthi Koteswara Rao, S/o.Kantha Rao, R/o.Do.18-28-64/125, Chinaranganipalem Village, Bhimavaram Mandal, W.G.Dist.

D10.Jagarlamudi Siva Krishna, S/o.Nageswara Rao, R/o.D.No.3D-12-32, Arundatipeta, Padamaraveedhi, Eluru.

D12: Bale Vijaya Babu, S/o.Suryanarayana Raju, R/o.D.No.2-46, Chinaranganipalem Village, Bhimavaram Mandal, W.G.Dist.

D13: Anam Bhimaraju, S/o.Nageswar Rao, R/o.D.No.2-15-4, Madepalli Village, Eluru.

D14: Pachipala Veera Venkata Siva Satyanarayana, S/o.Krishna Rao, R/o.D.No.7-14-5/1, 39th Division, Tangellamudi, Eluru.

D16: Samudarala leela Maheswara Rao, S/o.Venkata Madhusudhan Rao, GPA Agent, R/o.R.R.Peta, Eluru.

పై నెంబరు దావాలో పై ప్రతివాదులకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున పై కోర్టు వారు D.1, D.2, D.4, D.5, D.6, D.9, D.10, D.12, D.13, D.14, D.16 ప్రతివాదులు అయిన మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా దావా నోటీసులు అమలు చేయుటకు ఆర్డరు వేసియున్నారు. పై దావా **ది.28.6.2024**వ తేదీ ఉదయం గం.10.30 ని॥కు శ్రీకోర్టుకు హాజరు అయి మీ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనియెడల దావా మీ పరోక్షమున విచారించబడును.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఎన్.వై.వి.ప్రసాద్, ఎన్.రాముడు

ఏలూరు అడ్వకేట్స్, ఏలూరు.

22-5-2024 సెల్: 7780194120